## శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

### - డీఎస్పీ రామచంద్రారావు



రామాపురం, జూన్ 2, ప్రభాతవార్త: జూన్ 4న జరగనున్న సాధారణ ఎన్నికల కౌంటింగ్ రోజు శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని రాయచోటి డీఎస్పీ రామచంద్ర రావు అన్నారు. మండలంలోని నీలకంఠరావుపేట తదితర ప్రాంతాల్లో ఆదివారం రాత్రి సార్వత్రిక ఎన్నికల ఫలితాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాల్లో ఫలితాలు పూర్తయ్యే వరకు అప్రమత్తంగా ఉండాలని లక్కిరెడ్డిపల్లె సీఐ, ఎస్సైలకు పోలీసు సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐ జీవన్ గంగానాథ్‌బాబు, ఎస్సై ప్రసాద్‌రెడ్డి, ఏఎస్సై శ్రీనివాస శర్మ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్ఆర్-అన్నమయ్య
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## విందులో పాల్గొన్న మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సుగవాసి బాలసుబ్రమణ్యం

చిన్నమండెం, జూన్ 2, ప్రభాత వార్త :

మండలంలోని దేవగుడిపల్లె గ్రామం కురవపల్లెలో ఆదివారం కోటకొండ వెంకటరమణ ఇచ్చిన విందు కార్యక్రమానికి రాయచోటి తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిమ మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, రాజంపేట ఎమ్మెల్యే అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం పాల్గొని వారి ఆతిథ్యాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా జరిగిన ఎన్నికలపై పలువురితో చర్చించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం శ్రేణులు పాల్గొన్నారు.



## జూన్ 4న ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో

# నగరంలో ఆంక్షలు అమలు

### - నగరంలో 144 సెక్షన్ కింద నిషేధాలు అమలు
### - ప్రజలు పోలీసు శాఖకు సహకరించాలి
### - జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్



కడప క్రైం, జూన్ 2, ప్రభాతవార్త: ఈనెల 4న రిమ్స్ సమీపంలోని మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ పాలిటెక్నిక్ కాలేజీ బిల్డింగ్‌లో కౌంటింగ్ జరగనున్న నేపథ్యంలో కడప నగరంలో ఆంక్షలు అమలులో ఉంటాయని జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోకి ఎలాంటి వాహనాలు అనుమతించబడవని నగర శివార్ల నుంచి వాహనాలు మళ్లించేలా ప్రణాళిక రూపొందించడం జరిగిందన్నారు. నగరంలో 144 సెక్షన్ కింద నిషేదాజ్ఞలు అమలులో ఉంటాయని తెలిపారు. వాహనాలు దారి మళ్లింపు జరిగిందని రాయచోటి నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాలను కడప నగరంలోకి అనుమతించరు. కడప మీదుగా ఇతర ప్రాంతాలకు వెళ్లే వారు ఊటుకూరు సర్కిల్, సాక్షి సర్కిల్, ఇర్కాన్ సర్కిల్ మీదుగా ఔటర్ రింగు రోడ్డుపై ప్రయాణించాల్సి ఉంటుందన్నారు. రాజంపేట నుంచి వచ్చే వాహనాలు రామాంజనేయపురం మీదుగా ఇర్కాన్ జంక్షన్ రహదారిపై గమ్యస్థానినికి చేరుకోవాలి. మైదుకూరు, కమలాపురం వైపు నుంచి వచ్చే వాహనాలు ఇర్కాన్ సర్కిల్ మీదుగా వెళ్లాలి. ఎట్టి పరిస్థితుల్లో స్థానికులు తప్ప ఇతరులకు నగరంలోకి అనుమతి లేదు. వైసీపీ ఏజెంట్లకు, అభ్యర్థులకు ఇందిరానగర్ వద్ద పార్కింగ్ స్థలం ఏర్పాటు చేయడం జరిగింది. టీడీపీ ఏజెంట్లకు, అభ్యర్థులకు శిల్పారామం వద్ద ఏర్పాటు చేయడం జరిగింది. అక్కడి నుంచి అభ్యర్థులను కౌంటింగ్ ప్రాంతానికి ప్రత్యేక బస్సుల ద్వారా తీసుకెళ్లడం జరుగుతుందన్నారు. ఉదయం 6 గంటలకే కేంద్రానికి చేరుకోవాలని 7 తరువాత వచ్చిన వారిని ఎట్టి పరిస్థితుల్లో కౌంటింగ్ కేంద్రంలోనికి అనుమతి ఉండదని ఎస్పీ స్పష్టం చేశారు.

# కౌంటింగ్ సిబ్బందికి 2వ విడత ర్యాండమైజేషన్

### - జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిశోర్

రాయచోటి, జూన్ 2, ప్రభాతవార్త: అన్నమయ్య జిల్లాలో 024 సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ నిర్వహణ కోసం మొత్తం 918 మంది కౌంటింగ్ సిబ్బందికి 2వ విడత ర్యాండమైజేషన్ ద్వారా నియోజకవర్గాలను కేటాయించడం జరిగిందని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి ఎం.అభిషిక్త్ కిశోర్ అబ్జర్వర్లకు వివరించారు. ఆదివారం సాయంత్రం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాలులో ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియను పరిశీలించడానికి ఎలక్షన్ కమిషన్ ద్వారా జిల్లాకు కేటాయించబడిన అబ్జర్వర్లు బిపిన్ కుమార్ రాయ్, చరణ్ జీ లాల్, ఎ.కె.జ్రాపతిల సమక్షంలో సార్వత్రిక ఎన్నికలు-2024లో భాగంగా కౌంటింగ్ సిబ్బందికి నియోజకవర్గాలను కేటాయించే 2వ విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, జిల్లా కమిషన్ నిర్ణయించిన ప్రకారం కౌంటింగ్ సూపర్‌వైజర్లు, అసిస్టెంట్లు, మైక్రో అబ్జర్వర్లకు ఇప్పటికే మొదటి విడత ర్యాండమైజేషన్ నిర్వహించడం జరిగిందన్నారు. రెండో విడత ర్యాండమైజేషన్ ద్వారా 120 శాతం రిజర్వుతో కలిపి మొత్తం 918 మంది కౌంటింగ్ సూపర్‌వైజ్లు, అసిస్టెంట్లు, మైక్రో అబ్జర్వర్లకు నియోజకవర్గాలకు కేటాయించామని.. ఈ నియామక ఉత్తర్వులను సంబంధిత రిటర్నింగ్ అధికారులు సిబ్బందికి అందివ్వడం జరుగుతుందన్నారు. జూన్ 4వ తేదీన ఉదయం 5 గంటలకు 3వ విడత రానయండమైజేషన్ నిర్వహించి.. ఏ టేబుల్‌లో కౌంటింగ్ నిర్వహించాలో తెలపడం జరుగుతుందన్నారు. రాయచోటి జిల్లా కేంద్రంలోని శ్రీసాయి ఇంజినీరింగ్ కళాశాలలో ఒకే ప్రదేశంలో అన్ని నియోజకవర్గాల కౌంటింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని కౌంటింగ్ సిబ్బందికి అవసరమైన విధంగా శిక్షణలు కూడా పూర్తి చేయడం జరిగిందన్నారు. అనంతరం కౌంటింగ్ కేంద్రంగా ఏర్పాటు చేసిన శ్రీ సాయి ఇంజినీరింగ్ కళాశాల లొకేషన్ అందులో పార్లమెంటు మరియు అసెంబ్లీ నియోజకవర్గాల స్ట్రాంగ్ రూంలు, కౌంటింగ్ హాల్స్ ఏర్పాటు, బారికేడింగ్, సిబ్బంది శిక్షణ కార్యక్రమాలు, కౌంటింగ్ ప్రక్రియ, కౌంటింగ్ కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన మూడు అంచల భద్రత, స్ట్రాంగ్ రూములు కౌంటింగ్ హాల్స్ వద్ద ఏర్పాటు చేసిన కట్టుదిట్టమైన చర్యలను అలాగే వివిధ అంశాలను కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి, మరియు జిల్లా ఎస్పీ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అబ్జర్వర్లకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ బి.కృష్ణారావు, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, డీఆర్‌వో సత్యనారాయణరావు, అన్ని నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులతో పాటు సీపీవో కృష్ణా నాయక్, ఏడీ వెంకట్, కలెక్టరేట్ సూపరింటెండెంట్ నరసింహారావు, సంబంధిత నోడల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.




# కౌంటింగ్ సిబ్బందికి రెండవ విడత ర్యాండమైజేషన్

జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వి.విజయ్ రామరాజు



కడప, జూన్ 2 : ఏప్రిల్ 2 ప్రభాతవార్త : సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ నిర్వహణ కోసం కౌంటింగ్ సిబ్బందికి రెండవ విడత ర్యాండమైజేషన్ ద్వారా నియోజకవర్గాలకు విధులను కేటాయించడం జరిగిందని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామరాజు పేర్కొన్నారు.ఆదివారం సాయంత్రం 6.30 గంటలకు కలెక్టరేట్ లోని ఎన్ఐసి హాలులో.. జిల్లా ఎన్నికల పరిశీలకులు కునాల్ సిల్కు, భాను దాస్ పాలవె, జిల్లా జేసీ గణేష్ కుమార్, డిఆర్ఓ గంగాధర్ గౌడ్ లతో కలిసి జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వి.విజయ్ రామరాజు సార్వత్రిక ఎన్నికలు - 2024లో భాగంగా కౌంటింగ్ సిబ్బందికి నియోజకవర్గాల వారీగా విధులను కేటాయించే రెండవ విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను చేపట్టారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వి.విజయ్ రామరాజు మాట్లాడుతూ.. కౌంటింగ్ సిబ్బందికి ఇప్పటికే ఓట్ల లెక్కింపు ప్రక్రియకు సంబంధించిన శిక్షణను కూడా ఇవ్వడం జరిగిందని, శిక్షణా తరగతులకు గైర్హాజరు అయిన సిబ్బంది పై ప్రజాప్రాతినిధ్య చట్టం -1951 ప్రకారము కఠిన చర్యలు తీసుకోడం కూడా జరిగిందన్నారు. జూన్ 4వ తేదీన ఉదయం 5 గం లకు 3వ ర్యాండమైజేషన్ నిర్వహించి.. ఏయే టేబుల్ లో కౌంటింగ్ నిర్వహించాలో తెలపడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో అన్ని నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులతో పాటు. వెంకట్రావు, డీఐఓ విజయ్ కుమార్, సంబందిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## లబ్ డబ్... లబ్ డబ్...

# రాజంపేటలో 30 కోట్ల బెట్టింగ్ !!

### చక్రం తిప్పిన బెట్టింగ్ ' క్వీన్ 'ఎగ్జిట్ పోల్స్ తర్వాత...బెట్టింగ్ రాయుళ్లలో అలజడి...

**రాష్ట్రంలో ఏ పార్టీ అధికారం చేయబడుతుంది? ఏ పార్టీకి ఎన్ని సీట్లు వస్తాయి? అధికారం చేపట్టేందుకు మేజిక్ ఫిగర్ వస్తుందా? అంతకంటే ముందే నిలిచి పోతుందా? ఎంపీ సీట్లు ఏ పార్టీకి ఎన్ని వస్తాయి? రాజంపేటలో ఎవరు గెలుస్తారు? ఇక్కడ మెజార్టీ ఎంత వస్తుంది? ఇలాంటి ప్రశ్నలకు జవాబుగా రాజంపేటలో భారీ ఎత్తున బెట్టింగ్ జరిగింది. కువైట్లో మట్కా లేడీ డాన్ గా చక్రం తిప్పుతున్న ఓ మహిళ ఆధ్వర్యంలో బెట్టింగ్ జోరుగా సాగింది. బెట్టింగ్ పక్కన పెడితే ఎగ్జిట్ పోల్స్ తర్వాత పందెం కాచిన నేతల్లో వణుకు పుడుతోంది.**



రాజంపేట అర్బన్, జూన్2 ప్రభాతవార్త


రాజంపేట బెట్టింగ్ అలజడి ప్రారంభమైంది. పందెం కాచిన నేతలు తల పట్టుకుంటున్నారు. ఎగ్జిట్ పోల్స్ తర్వాత పందెం రాయుళ్లలో టెన్షన్ క్లైమాక్స్ కు చేరింది. రాజంపేట కేంద్రంగా 30 కోట్ల రూపాయల పైబడి బెట్టింగ్ జరిగినట్లు సమాచారం. ముఖ్యంగా వైసీపీ, తెలుగుదేశం సానుభూతిపరులు, నేతలు ఎక్కువగా బెట్టింగ్ పెట్టారు. రాజంపేట మండలం బ్రాహ్మణపల్లి చెందిన మట్కా డాన్ గా పేరుపొంది , హవాలా ఇతర వ్యాపారాలు చేసే ఓ క్వీన్ ఆధ్వర్యంలో కోట్ల రూపాయలు బెట్టింగ్ జరిగినట్లు తెలిసింది. రాజంపేటలో ఆమె సంబంధికులు రాష్ట్రంలోఏ పార్టీ అధికారంలోకి వస్తుందని బెట్టింగ్ జరిగినట్లు సమాచారం. ఈమె అధికార పార్టీ మరల అధికారం చేపడుతుందని పందెం కాచినట్లు తెలిసింది. ఓ సామాజిక వర్గానికి చెందిన నేతలే ఎక్కువగా ఈమె దగ్గర పందెం కాచినట్లు తెలుస్తోంది. మరోవైపు ఓ రియల్టర్ రూపాయల బెట్టింగ్ చేసినట్లు సమాచారం. రాజంపేట చెందిన అధికార పార్టీకి చెందిన కీలక నేతలు, ఇక్కడే నివాసం ఉంటున్న నందలూరు మండలానికి చెందిన ఓ నాయకుడు కోట్ల రూపాయలు బెట్టింగ్ కాచినట్లు తెలిసింది. వీరిద్దరు కూడా రాజంపేట నియోజకవర్గంలో వచ్చే మెజార్టీ పైన ఎక్కువ పందెం కాచినట్లు తెలిసింది. తెలుగుదేశం నేతలు రాజంపేటలో మెజారిటీ పై బెట్ చేసినట్లు సమాచారం. ప్రధానంగా నియోజకవర్గంలో వైసిపి అభ్యర్థి అమర్నాథ్ రెడ్డికి 10000 మెజార్టీ లభిస్తుందని 15 కోట్ల రూపాయలు పైబడి బెట్టింగ్ జరిగినట్లు తెలిసింది. వారం రోజులు క్రితం 13000 మెజార్టీకి వైసీపీ ముఖ్య నేత కోటి రూపాయలు పైబడి పందెం పెట్టినట్లు పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతుంది. సుండుపల్లె, సిద్ధవటం , రాజంపేట మండలాలలో తెలుగుదేశంకు మెజారిటీ వస్తుందని వైసీపీ నేతలతో పందెం కాచినట్లు తెలిసింది. వైసిపికి మెజార్టీ పై కూడా పందెం జరిగినట్లు ప్రచారం జరుగుతోంది. అయితే గత మూడు రోజులుగా గెలుపుపై మాత్రమే బెట్టింగ్ జరుగుతుంది. రాయలసీమలో వైసీపీ- టీడీపీకి మధ్య వచ్చే సీట్ల పైన కూడా పందెం జరిగింది. తెలుగుదేశం, వైసిపి పార్టీలకు మాత్రమే మ్యాజిక్ ఫిగర్ కు అవసరమైన సీట్లు వస్తాయనే దాని పైన కూడా బెట్టింగ్ జరిగినట్లు సమాచారం. ఏది ఏమైనా పందెం రాయుళ్లకు మరో 24 గంటలు టెన్షన్ అనివార్యం.

# పట్టణంలో పేట్రేగుతున్న అక్రమ వడ్డీ వ్యాపారం

- అత్యవసర పరిస్థితుల్లో వస్తువుల తాకట్టు
- అడిగినంత చెల్లించలేక సామాన్యుల గగ్గోలు
- అధికంగా టీ దుకాణాల్లో వడ్డీ వ్యాపారాలు
- ఇలాంటి వ్యాపారాల్లో మహిళలదే హవా..

మదనపల్లె, ఏప్రిల్ 2 ప్రభాతవార్త :

పట్టణంలో అధికమవుతున్న వడ్డీ వ్యాపారాలు...చీటీల దారులు...రోజువారి కంతులు..వారాంతపు కంతులు..అధిక వడ్డీ మాఫీయలు...ఏటిఎం కార్డులు కొదవ పెట్టడం...నగదు..ఇతర వస్తువుల తాకట్టు ఇలాంటి వ్యాపారాలు పట్టణంలో ఇటీవల అధికమయ్యాయి. రోజు రోజుకూ వారి ఆగడాలకు అంతులేకుండా పోతోంది. అనుమతులు లేకుండానే విచ్చలవిడిగా వడ్డీ వ్యాపారం చేస్తూ అమాయక జనాన్ని మోసం చేస్తున్నారు. వారం రోజులకు రూ.10వేలు తీసుకుంటే అందులో ముందుగానే వడ్డీని తీసేసుకొని కేవలం రూ.9వేలు మాత్రమే చెల్లిస్తున్నారు. తీసుకున్న బాధితులు రూ.10వేలను వారంలో చెల్లించాల్సి ఉంటుంది. దీంతో ప్రతిరోజూ వెయ్యి రుపాయలు చొప్పున పదిరోజులు పాటు ఖచ్చితంగా చెల్లించాల్సిందే లేదంటే పదిమందిలో పరువు కడిగేస్తారు. ఆపద వచ్చినా ఇంట్లో శుభకార్యం ఉన్నా ఖచ్చితంగా డబ్బు కట్టాల్సిందే. ఈ వంతున పదిరోజులకు పదివేలు చెల్లించి తిరిగి మళ్ళీ అప్పులు ఇస్తున్న మాఫియా అత్యవసర పరిస్థితుల్లో బాధితుల నుంచి ప్లాటకు సంబంధించి పేపర్లు, ఏటిఎం కార్డులను, బైక్‌లను, ఖాళీ ప్రామసరీబాండ్లు, బంగారం లాంటి ఇతర విలువైన వస్తువులను తాకట్టు పెట్టుకొని ముక్కుపిండి చక్రవడ్డీ వేసి వసూలు చేస్తున్నారు. అలాగే సకాలంలో వడ్డీ డబ్బులు చెల్లించని వారిపై వ్యాపారులు దౌర్జన్యాలకు, దాడులకు పదిమందిని పోగు చేసుకొని పాల్పడుతున్నారు. కొన్ని కొన్ని సందర్భాలలో అప్పుగా డబ్బులు తీసుకొన్న వారు ఎదురు తిరిగితే వడ్డీ వ్యాపారులు రౌడీల సాయంతో వారిపై దాడులు చేయిస్తూ హంగామాలు సృష్టిస్తున్నారు. ఇలా పట్టణంలో వడ్డీ వ్యాపారం మూడు పువ్వులు, ఆరు కాయలుగా విరజల్లుతోంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు కష్టపడి సంపాదించిన డబ్బు ఈ వ్యాపారులకు చెల్లించే వడ్డీలకే సరిపోతుందని సామాన్యులు, చిరు వ్యాపారులు వాపోతున్నారు. ఈ తతంగమంగా బడా నేతల కనుసన్నుల్లోనే జరుగుతున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. ఇదంతా రక్షక భటులకు తెలిసినా ఫిర్యాదులు చేస్తేనా మాపని చేస్తామని లేదంటే మేం ఏమి చేయలేమని అంటున్నారు. ఒకవేళ ఫిర్యాదులు చేసినా పోలీసులు మామూళ్ళు తీసుకొని వదిలి వేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఎందుకంటే ఖాకీలకు కూడా అప్పులు ఇచ్చేది వారే కాబ్బటి. ఇచ్చిన అప్పు పైకాన్ని పోలీసులు ఇస్తారో లేదో తెలియదు కాని పోలీసుల చేతుల్లో ఫిర్యాదుదారుడే మోసపోతాడనడంలో సత్యం ఉంది. పట్టణంలో అధికంగా మదనపల్లెలో ఫైనాన్సియర్స్ వందకు మొదట రూ.4లు, మళ్ళీ రూ.8లకు, చివరకు రూ.10లకుపెంచి అధిక వడ్డీలు వేయడం. తరువాత అక్కడక్కడా బోర్డుతిప్పేస్తున్నారు. ఫైనాన్స్ కార్యక్రమాలకు టి దుకాణాలు అడ్డాగా మారాయి. ఇలా అధిక వడ్డీలు వసూలు చేసి రుణబాధితుల నుంచి మోయలేని భారాన్ని వడ్డీ వ్యాపారులు, చీటీ నిర్వాహకులు మోపుతున్నారు. చిరు వ్యాపారుల నుండి మొదలుకొని ఓ స్థాయి ఉద్యోగుల వరకు ఈ వ్యాపారులు అప్పులిస్తారు. వారి అవసరాన్ని ఆసరాగా తీసుకొని అధిక వడ్డీ వసూలు చేస్తున్నారు. ఇటీవల పట్టణంలో బెంగుళూరు బస్టాండు టీ దూకాణాల్లో వడ్డీవ్యాపారం అధికంగా జరుగుతోంది. సొసైటికాలనీ, అప్పారావువీధి, త్యాగరాజవీధి, దేవళం వీధి వంటి ప్రధాన వీదుల్లో ఈ తంతు అధికంగా జరుగుతున్నట్లు తెలుస్తోంది. వీటికి తోడు అనధికార చీట్టీలు నిర్వహణ అధికంగా సొసైటికాలనీ, రామారావుకాలనీ, చంద్రాకాలనీ, జగన్‌కాలనీలో టమోటా మార్కెట్‌యార్డు, నీరుగట్టువారిపల్లెల్లో అధిక చీటులు వేయడం గుడారాలు మార్చేయడం జరుగుతోంది. ఇలాంటి చీటీల నిర్వాహకుల వల్ల చిరు వ్యాపారులు ఉద్యోగులు మోసోతున్నారు. కొందరు చిటీల వసూలు చేసి తరువాత జెండా ఏత్తేయడంతో వారిపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేకపోతున్నారు. వాస్తవానికి చీటీలు నిర్వహణ నడపాలంటే రిజిస్టర్ కార్యాలయంలో నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. అయినా స్థానికంగా పట్టణంలో ఉండే వారి దగ్గర చీటీలు వేయడం వారు ఉడాయించిన తరువాత బాధపడడం ప్రజల వంతువుతోంది.



## కడప జిల్లాలో టీబీ మందులకు కొరత లేదు

### - రాష్ట్ర టీబీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ టి.రమేష్ వెల్లడి



అమరావతి: వైఎస్సార్ కడప జిల్లాలో ఎక్కడా టీబీ మందులకు కొరత లేదనిటీబీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ టి.రమేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.వైఎస్ఆర్ కడప జిల్లా ప్రొద్దుటూరు ఆసుపత్రిలో అవసరమైన టీబీ మందులు లేవని జరుగుతున్న ప్రచారం నిజం కాదని ఆయన పేర్కొన్నారు. కడప జిల్లాలో అవసరమైన స్థాయిలో టిబి నివారణ మాత్రలు అందుబాటులో

# విధ్యార్ధి దశ ప్రతి ఒక్కరికి కీలకమైనది



ప్రొద్దుటూరు అర్బన్, జూన్ 02, ప్రభాతవార్త: విధ్యార్ధి దశ ప్రతి ఒక్కరికి కీలకమైనదని తొగటవీర క్షత్రియ సేవాసంఘం అధ్యక్షుడు బండారు సూర్యనారాయణ పేర్కొన్నారు.స్థానిక వసంతపేటలోని తొగటవీర క్షత్రియ కళ్యాణమండపంలో ఆదివారం పదవ తరగతి, ఇంటర్మీడియట్‌లలో ఉత్తమ ఫలితాలు సాధించిన తొగటవీర క్షత్రియ విధ్యార్ధులకు12వ వార్శిక ప్రతిభా పురస్కారాల ప్రధానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సంధర్బంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరి జీవితంలో విధ్యార్ధి దశ ఎంతో కీలకమైనదని,విద్యతోనే విధ్యార్ధులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, విధ్యార్ధులు ఉన్నతమైన లక్ష్యాన్ని ఎంచుకొని కష్టపడి దానిని సాధించాలన్నారు. విలువైన సమయాన్ని సద్వినియోగంచేసుకుంటూ బంగారు భవిష్యత్తుకు బాట వేసుకోవాలన్నారు. ప్రతిభ గల విధ్యార్ధులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో దాతల సహకారంతో ప్రతిభా పురస్కారాలను సంఘంఆధ్వర్యంలో అందజేస్తున్నామన్నారు. ఎవరైన ఆర్ధిక స్థోమత లేని ప్రతిభ గల తొగటవీర విధ్యార్ధులు ఉంటే సంఘాన్ని సంప్రదిస్తే తగిన సహకారం అందిస్తామన్నారు. నియోజకవర్గంలోనిప్రభుత్వ పాఠశాలల్లో చదివి 10వ తరగతి ఉత్తమ మార్కులు సాధించిన, స్థానికంగ ఇంటర్ చదివి ఇంటర్ ప్రధమ, ద్వితీయ సంవత్సరంలో మంచి మార్కులు సాధించినవిధ్యార్ధిని, విధ్యార్ధులకు ఎంబీబీఎస్ చదువుతున్న విధ్యార్ధిని శ్రీలీనాకు రూ.25వేలు ఆర్ధిక సహాయంతో పాటు మొత్తం 85మంది విధ్యార్ధులకు రూ.1.90లక్షలను ప్రతిభాపురస్కారాలుగా అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తొగటవీర క్షత్రియ కళ్యాణ మండప అధ్యక్షుడు బండారు రఘురామయ్య, కార్యదర్శి పల్లా శేశయ్య, కోశాధికారిగంజికుంట ఆంజనేయులు, ఉపాధ్యక్షుడు నాగేశ్వరరావు, ఉమ్మడిశెట్టి చౌడయ్య, మోతుకూరి సుబ్బయ్య, పల్లా శంకర్‌నారాయణ, లక్ష్మినారాయణ, కంబం చిన్నపుల్లయ్యతదితరులు పాల్గొన్నారు.

## సిరి నిరాశ్రయుల అనాథ వృద్ధాశ్రమంలో నిరాడంబరంగా జన్మదిన వేడుకలు



జమ్మలమడుగు, జూన్ 2, ప్రభాతవార్త: జమ్మలమడుగు పట్టణంలోని నాగులకట్టలో ఉన్న సిరి నిరాశ్రయుల వృద్ధాశ్రమంలో ఉన్న అనాథ వృద్ధులకు పండ్లు, బ్రెడ్డు, బిస్కెట్ ప్యాకెట్లను పంపిణీ చేసినట్లు ముద్దనూరు మండల వ్యవసాయాధికారి మారెడ్డి వెంకట కృష్ణారెడ్డి తెలిపారు. అనంతరం వృద్ధాశ్రమంలో ఉన్న వృద్ధులకు తమ కూతురు దివ్యశ్రీ చేతుల మీదుగా పండ్లు, బ్రెడ్డు, బిస్కెట్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తమ సతీమణి మారెడ్డిరాధ, కుమారుడు ఎం.వి.నిహాల్‌రెడ్డి, మరియు అనాథ వృద్ధులు పాల్గొన్నారు.

## హైదరాబాదును ఉమ్మడి రాజధానిగా మరో 10 సంవత్సరాలు పొడిగించాలి

### - బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు ప్రసాద్ గౌడ్ డిమాండ్



కడప వైద్యవిభాగం, జూన్ 2, ప్రభాతవార్త: ఏపీతో తెలంగాణకు ఉన్న ఉమ్మడి రాజధాని బంధం నేటితో ముగియనున్న సందర్భంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు ప్రసాద్ గౌడ్ విచారం వ్యక్తం చేశారు. హైదరాబాదును ఉమ్మడి రాజధానిగా మరో 10 సంవత్సరాలు పొడిగించాలని డిమాండ్ చేశారు. జూన్ 2న తెలంగాణ స్వరాష్ట్రంగా ఆవిర్భవించిన విషయం తెలిసిందే. రాష్ట్రం విభజన సమయంలో ఇచ్చిన హామీలు పరిష్కరించబడకుండానే శాశ్వత ముగింపు పడిందని ఆయన అన్నారు. రాష్ట్ర విభజన చట్టంలో హైదరాబాదును తెలంగాణకు శాశ్వత రాజధానిగా, ఏపీ రాష్ట్రానికి పదేండ్ల పాటు తాత్కాలిక, ఉమ్మడి రాజధానిగా కేంద్రం ప్రకటించిన విషయం అందరికీ తెలిసిన విషయమేనని ఆయన తెలిపారు. విభజన చట్టం సెక్షన్ 8 ప్రకారం హైదరాబాదు ఉమ్మడి రాజధాని ప్రాంతంలో పౌరుల రక్షణ బాధ్యతను గవర్నర్‌కు అప్పగించారని, ఉమ్మడి రాజధానిలో నివసించే ప్రజల ప్రాణ, ఆస్తి, రక్షణ భద్రతలను కాపాడే బాధ్యతలను గవర్నర్ చేతిలో ఉండేవని, అందువలన ఏపీ ప్రాంతం నుంచి చాలా మంది ప్రజలు హైదరాబాదు పరిసర ప్రాంతాల్లో తాత్కాలిక నివాసం ఏర్పరచుకున్నారని మరి రేపటి నుంచి ఈ ప్రజల ఆస్తులు రక్షణ బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వం ఏ మేరకు బాధ్యత తీసుకుంటుందని ప్రసాద్‌గౌడ్ ప్రశ్నించారు. సెక్షన్ 95 ప్రకారం విద్యార్థులకు పదేండ్ల పాటు ఉన్నత విద్యలో అవకాశాలు కల్పించాలని ఆర్టికల్ 317 డి ప్రకారం అడ్మిషన్ల కోటా పదేండ్ల వరకు కొనసాగించాలని ఎమ్సెట్ సహా 7 రకాల ప్రవేశ పరీక్షలు కూడా ఉమ్మడిగా నిర్వహించేవారని ఆయన గుర్తు చేశారు. 10 ఏళ్లుగా అనేక సమస్యలు అపరిష్కృతంగానే ఉన్నాయని కృష్ణా, గోదావరి జలాల పంపిణీ గుదిబండగా మారిందని, అపెక్స్ కమిటీలు, నదీ యాజమాన్య బోర్డుల మధ్యే నలుగుతున్నదని, దీనిపై కేంద్రం ఎటూ తేల్చకపోవడంపై ప్రసాద్ గౌడ్ ఆగ్రహం వ్యక్త పరిచారు. అకనైనా అన్ని రాజకీయ పార్టీల వారు ఎజెండా పక్కన పెట్టి కలిసి వచ్చే ప్రజా సంఘాలను కలుపుకొని ఏపీ రాజధానిని నిర్మించుకునే వరకు హైదరాబాదును ఉమ్మడి రాజధానిగా 2014 పునర్విభజన చట్టాన్ని సవరించి కొనసాగించాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు ప్రసాద్ గౌడ్ పిలుపునిచ్చారు.

## తంబళ్లపల్లె ఓ క్రీడా ప్రాంగణంగా తయారు కావాలి

### - మెడికల్ ఆఫీసర్ వెంకటరామయ్య



తంబళ్లపల్లె, జూన్ 2, ప్రభాతవార్త: తంబళ్లపల్లె నియోజకవర్గం అన్ని రకాల క్రీడాకారులతో ఓ క్రీడా గ్రామంగా తయారు కావడానికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా సహకరించాలని మెడికల్ ఆఫీసర్ వెంకటరామయ్య పిలుపునిచ్చారు. ఆదివారం ఐటీఐ మైదాన ప్రాంగణంలో సమ్మర్ కోచింగ్ క్యాంప్ ముగింపు కార్యక్రమంలో ప్రముఖులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఎస్‌డీవో గౌస్‌బాషా మాట్లాడుతూ తంబళ్లపల్లె సమ్మర్ కోచింగ్ సెంటర్ విజయవంతంలో కోచ్ యూసఫ్ కృషి ఫలితమేనన్నారు. ఎస్సై శివకుమార్ మాట్లాడుతూ సమ్మర్ కోచింగ్ ద్వారా నరగామీణ క్రీడలకు జీవం పోయడం అభినందనీయమన్నారు. పీఈటీ రమేష్, సీనియర్ పీడీ భద్రయ్య, పీడీ ఖాదర్ బాషా, ఖేలో ఇండియా పెన్సింగ్ కోచ్ రవీంద్ర, పోస్టుమాస్టర్ మురళీ, హైస్కూల్ కమిటీ ఛైర్మన్ సురేష్‌బాబులు మాట్లాడుతూ తంబళ్లపల్లె లాంటి మారుమూల వెనకబడిన ప్రాంతంలో క్రీడాకారుల ప్రతిభను గుర్తించి వారిలో నైపుణ్యాన్ని పెంచి సమ్మర్ క్యాంప్ ద్వారా వెలుగులోకి తెచ్చిన కోచ్ యూసఫ్ అందరికీ ఆదర్శమన్నారు. ఉన్నత స్థాయికి చేరడానికి కృషి చేయాలని ఇందుకు ప్రభుత్వం పరంగా సాయమందించాలని కోరారు. కోచ్ యూసఫ్ మాట్లాడుతూ క్యాంపు విజయవంతానికి సహకరించిన క్రీడాకారులకు, సభకు హాజరైన అతిథులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం వాలీబాల్ క్రీడా పోటీలలో రాణించిన క్రీడాకారులతో పాటు క్యాంపులో పాల్గొన్న ప్రతి ఒక్కరికి మెమెంటోలు, మెడల్స్ సభాధ్యక్షులు అందజేశారు. ఈ ముగింపు కార్యక్రమంలో సీనియర్ క్రీడాకారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## సెంట్రీ డ్యూటీలో మహిళా కానిస్టేబుల్ మృతి



రాయచోటి, రాయచోటి గ్రామీణ, జూన్ 2, ప్రభాతవార్త: అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటి జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో సెంట్రీ డ్యూటీలో ఉన్న వేదవతి(26) అనే మహిళా కానిస్టేబుల్ గన్నుతో కాల్చుకొని ఆత్మహత్యకు పాల్పడింది. అయితే గన్నుతో కాల్చుకొని ఆత్మహత్య చేసుకుందా లేక మిస్‌ఫైర్ అయ్యి మృతిచెందిందా అనేది తెలియాల్సి ఉంది. భర్త పేరు దస్తగిరి ఆయన సొంత ఊరు మదనపల్లి. వేదవతి సొంత ఊరు పుంగనూరు వద్ద బింగానిపల్లె. వేదవతి చిత్తూరులో కానిస్టేబుల్‌గా పని చేస్తూ సంవత్సరం క్రితం బదిలీపై అన్నమయ్య జిల్లా పోలీసు కార్యాలయానికి వచ్చింది. వేదవతి దంపతులు రాయచోటి పట్టణంలోని ఇందిరమ్మ కాలనీలో నివాసం ఉంటున్నారు. సెంట్రీ డ్యూటీలో ఉన్న వేదవతి గన్నుతో కాల్చుకొని మృతి చెందిందనే విషయం తెలియాలల్సి ఉంది. ఈ మేరకు డీఎస్పీ రామచంద్రారావు, అర్బన్ సీఐ సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో మృతదేహాన్ని రాయచోటి ఏరియా ఆసుపత్రికి తరలించారు.

## వీక్షకులను అలరించిన చిన్నారులు




కడప కార్పొరేషన్, జూన్ 2, ప్రభాతవార్త: సాయం సంధ్యా వేళలో పచ్చని ఆహ్లాదకరమైన వాతావరణంలో కడప శిల్పారామంలో చిన్నారులు తమ ప్రతిభతో వీక్షకులను అలరించారు. ఆదివారం కడప శిల్పారామంలోని శిల్ప కళావేధికపై మిస్స మూవీ పద్మాకర్ ఆధ్వర్యంలో బద్వేలు ప్రాంతానికి చెందిన అనూష్ బాబు బృందంపల్లె జానపద, సినీ నృత్యాలతో కడప వాసులను అలరించారు. ఈ కార్యక్రమాన్ని కడప శిల్పారామం పరిపాలనాధికారి మునిరాజు పర్యవేక్షించారు.

## 26 మంది కంటి రోగులకు ఆపరేషన్లు



రాయచోటి గ్రామీణ, జూన్ 2, ప్రభాతవార్త:

అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణ పరిధిలోని చెన్నముక్కపల్లె గ్రామంలో గల లయన్స్ కంటి ఆసుపత్రిలో ఆదివారం 26 మంది కంటి రోగులకు ఆపరేషన్లు నిర్వహించారు. ఈ సందర్భంగా రాయచోటి నియోజకవర్గంతో పాటు అన్నమయ్య జిల్లా పరిధిలోని రాజంపేట, రైల్వేకోడూరు, కలకడ, కలికిరి, కె.వి.పల్లి, ఎర్రవారిపాలెం, గుర్రంకొండ, పెద్దమండెం, ఎన్‌పీ కుంట, కదిరి, చక్రాయపేట తదితర ప్రాంతాల నుంచి వచ్చిన 40 మంది కంటి రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించిన కంటి వైద్యులు అందులో అర్హులైన 26 మందికి ఆపరేషన్లు చేశారు. అలాగే గతంలో ఆపరేషన్ చేయించుకున్న 35 మంది కంటి రోగులకు ఉచితంగా అద్దాలు మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కంటి ఆసుపత్రి ఛైర్మన్ వైవీ స్వరూప గుప్తా, కోశాధికారి శివప్రసాద్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ చెన్నూరు అన్వర్ బాషా, ఏపీఐఐసీ డైరెక్టర్ శ్రీనివాసులురెడ్డి, లయన్స్ డిస్ట్రిక్ట్ ఛర్మన్ శివరామిరెడ్డి, లయన్ జయరామిరెడ్డి, కంటి వైద్యులు సురేష్‌బాబు, భార్గవి, అప్తాలిక్ అసిస్టెంట్ మూలి రాజగోపాల్‌రెడ్డి, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం ముగింపు



కలికిరి, జూన్ 02 ప్రభాతవార్తః త్రైత సిద్ధాంతం- ప్రబోధ సేవాసమితి ఇందూజ్ఞాన వేదిక నెల్లూరు కమిటీ సభ్యులు ఆద్వర్యంలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం నియోజకవర్గంలోని కలికిరిలో అజయ్ కన్వెన్షన్ హాలులో ముగింపురోజు సందర్భంగా శ్రీకష్ణ భగవాన్ పూజ కార్యక్రమం నిర్వహించారు.

పీలేరు నియోజకవర్గంలోని పీలేరు, కలికిరి, కేవి.పల్లె, వాల్మీకిపురం మండలాల్లో ప్రచారం ముమ్మరంగా నిర్వహించారు.సంబేపల్లె చిత్తూరు జిల్లాలోని సదుం, సోమవల, రొంపిచెర్ల మండల గ్రామాల్లో కూడా ప్రచారం నిర్వహించారు. భగవద్గీతలోని పురుషోత్తమ ప్రాప్తి యోగం అధ్యయం నందు 16వ శ్లోకంలోక్షర పురుషుడు అని జీవాత్మ గురించి అక్షర పురుషుడు అని ఆత్మ గురించి 17వ శ్లోకంలో పురుషోత్తముడు అని పరమాత్మ గురించి చెప్పారు. అంటే జీవాత్మ, ఆత్మ పరమాత్మ గురించి చెప్పారు. జీవాత్మ ఆత్మ పరమాత్మ అనే మూడు ఆత్మలు ఆధ్మాత్మికంలో ముఖ్యమైనవని అర్థం, దీని ఆధారంగానే త్రైత సిద్ధాంత భగవద్గీతన గురువుగారు వ్రాశారు. .. ఒక సిద్ధాంతాన్ని ప్రతి పాదన చేసి శాస్త్ర బద్దతతో కూడిన జ్ఞానంను అందించారు. ఈకార్యక్రమంలో త్రైత సిద్ధాంతంప్రబోధ సేవాసమితి ఇందూజ్ఞానవేదిక నెల్లూరు కమిటీ అధ్యక్షులు సురమౌళి, సోమశేఖర్, రామకష్ణ, సునీల్, పద్మజ, జ్ఞానేశ్వర్, సుమలత, పూర్ణిమ తదితరులు పాల్గొన్నారు.

## ఎఫ్‌పీఓలదే భవిష్యత్తు



పీలేరు, జూన్ 02 ప్రభాతవార్తః వ్యవసాయ రంగంలో వస్తున్న విప్లవాత్మక మార్పుల కారణంగా రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు మంచి భవిష్యత్తు ఉంటుందని రాష్ట్ర అటవీశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ చిరంజీవి చౌదరి పేర్కొన్నట్లు అన్నమయ్య జిల్లా వ్యవసాయ సలహామండలి సభ్యులు

బోదేషావలి తెలిపారు. అధికారిక పర్యటన కోసం తిరుపతికి వచ్చిన చిరంజీవి బోదేషావలి నూతనకాలువకు చెందిన ప్రముఖ ప్రకతి వ్యవసాయ రైతు శివకుమార్ ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. గతంలో ఉద్యానశాఖ ప్రధాన కార్యదర్శిగా ఉన్న సమయంలో చిరంజీవి చౌదరి పీలేరు

ప్రాంతంలో రైతు ఉత్పత్తిదారుల సంఘాలు ఏర్పాటుకు పెద్ద ఎత్తున ప్రోత్సహించారు. తన హయాంలో ఏర్పాటుచేసిన ఎఫ్‌పీఓల పనితీరును ఈసందర్భంగా చిరంజీవి చౌదరి వాకబుచేసినట్లు బోదేషావలి తెలిపారు. వ్యవసాయ రంగాన్ని అభివద్ధి చేసే రైతులకు నాణ్యమైన గిట్టుబాటు ధరలు

కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ పథకాల అమలు చేస్తున్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలంటే రైతులు ఎఫ్పీవోలుగా మారాలని చిరంజీవి చౌదరి సూచించినట్లు బోదేషావలి తెలిపారు. పీలేరు ప్రాంత రైతులకు ఉపయోగకరంగా ఉంటున్న పీలేరు రైతు ఉత్పత్తిదారుల సంఘం గురించిఔఆయన ప్రత్యేకంగా అడిగినట్లు బోదేషావలి తెలిపారు. అవకాశం దొరికితే త్వరలోనే పీలేరు ఎఫ్‌పీఓను సందర్శిస్తానని తెలిపారు.

## ఏపీలో మళ్లీ ఫ్యాన్ ప్రభంజనమే

### - జిల్లా వైసీపీ అధికార ప్రతినిధి ఆడిటర్ మన్సూర్ అలీఖాన్



రాయచోటి గ్రామీణ, జూన్ 2, ప్రభాతవార్త: 2019 ఎన్నికల్లో వైసీపీ ఘన విజయం సాధించి సత్తా చాటింది. వైసీపీ ప్రభుత్వ పాలనలో సంక్షేమానికి పెద్దపీట వేశారు. ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపడ్డాయని అన్నమయ్య జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి ఆడిటర్ మన్సూర్ అలీఖాన్ ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డిఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చాక 99 శాతం అమలు చేయడంతో పేద వర్గాల్లో అధికార వైఎస్ఆర్‌సీపీకి ఆదరణ మరింత పెరిగిందన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీ ఓటర్లు వైసీపీకి మరోసారి అవకాశం కల్పించారని చాణిక్య, ఆరా మస్తాన్, సీపీఎస్. పర్దా దాస్, జన్ మత్ లాంటి సర్వేలు 2024 ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు చెబుతున్నాయన్నారు.

## వైభవంగా శ్రీవీరాంజనేయస్వామి ఊరేగింపు



పీలేరు,జూన్ 02 ప్రభాతవార్తః శ్రీహనుమజ్జయంతి సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించి ఆదివారం సాయంత్రం శ్రీశ్రీశ్రీ వీరాంజనేయస్వామి ఉత్సవ విగ్రహానికి మంగళవాయిద్యాలు, పిల్లనగ్రోవులు, కోలాటాలు నడుమ పుష్పపల్లకిలో ఉత్సవ మూర్తులకు నగరోత్సవం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు శ్రీవీరాంజనేయస్వామిని దర్శించుకుని స్వామివారికపకు పాత్రులైనారు. ప్రధాన అర్చకులు శ్రీరాజుస్వామి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు, ఈకార్యక్రమంలో ఆలయ ప్రధాన సభ్యులు నాగభూషణం ప్రజలు పాల్గొన్నారు.

## నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు-సీఐ రామాంజులు



ఖాజీపేట, జూన్ 02, ప్రభాతవార్త: జూన్ 4వ తేదిన ఎలక్షన్ కౌంటింగ్ ప్రక్రియ ఉన్నందున ప్రజలు మెడికల్ ఎమర్జెన్సీ ఉంటే తప్ప అనవసరంగా బయటికి రావద్దనిఖాజీపేట సీఐ రామాంజులు తెలిపారు. పోలీసు నిబంధనలను ఎవ్వరు అతిక్రమించిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సెక్షన్ 144 మరియు 30పోలీస్‌యాక్ట్ అమలులో ఉన్నందున ప్రజలు నలుగురికి మించి గుంపులు, గుంపులుగా ఉండరాదని, మద్యం సేవించి ఒకరితో ఒకరు గొడవలు పడటం చేయరాదని అన్నారు.గెలిచిన వారు ర్యాలీలు, ఊరేగింపులు, బాణాసంచాలు కాల్చడం, డీజేలు పెట్టడం, డ్రమ్ములు కొట్టడం చేయరాదని, గెలిచిన పార్టీకి సంబంధించిన వారు ఓడిపోయిన పార్టీ వారిని రెచ్చగొట్టడం మరియు కవ్వింపు చర్యలకు పాల్పడటం చేయరాదని అన్నారు.

## కొమ్మరపల్లిలో గాలీ వానకు రేకులు ధ్వంసం

రామాపురం, జూన్ 2, ప్రభాతవార్త: మండలంలోని కుమ్మరపల్లి పంచాయతీలోని పలు గ్రామాల్లో శనివారం రాత్రి వీచిన గాలీ వానకు పలు కుటుంబాల ఇళ్లకు ఏర్పాటు చేసిన రేకుల పైకప్పులు లేచి పోయాయి. మరో ఇంటిపై విద్యుత్తు స్తంభాలు పడడంతో రేకులు ధ్వంసం అయ్యాయి. చెట్లు విరిగి పోవడంతో ప్రజలు భయబ్రాంతులకు గురయ్యామని ఆ గ్రామానికి చెందిన పలువురు ఆరోపించారు. కుమ్మరపల్లి పంచాయతీలోని దూదేకుల పల్లెలో సుంకేసుల కృష్ణయ్య, రాజు, బండపల్లిలో షేక్ ముబారక్, మోహన్, లక్ష్మయ్య, జమాల్‌పల్లి ఇళ్లపై ఏర్పాటు చేసిన రేకులు గాలీ వానకు లేచిపోయాయి. ఆ ఇండ్లపై కొమ్మలు విరిగిపడ్డాయి. అలాగే అదే గ్రామానికి చెందిన షేక్ అబ్దుల్ సాబ్ ఇంటిపై విద్యుత్తు స్తంభం పడడంతో రేకులు ఒక సారిగా ఎరిగి ఇంటిలో పడ్డాయి. ఇళ్లల్లో ఉన్న పిల్లలు పెద్దలు మహిళలు భయంతో గుర్రై బయటికి వెళ్లారు. ఎలాంటి అవాంఛనయీ సంఘటనలు జరగలేదు. ఇండ్లపై ఏర్పాటు చేసిన రేకులు లేచి పోవడంతో ప్రజలు ఆరు బయట ఉండాల్సిన పరిస్థితి వచ్చిందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు తమ గ్రామాన్ని సందర్శించలేదని తమకు న్యాయం జరగాలని గ్రామస్థులు కోరారు.

# రైతులకు సరిపడ విత్తనాలు, ఎరువులు ఇవ్వాలి

### - ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి

గాలివీడు, జూన్ 2(ప్రభాతవార్త):

రాష్ట్రంలో వ్యవసాయ సీజన్‌కు అనుగుణంగా వ్యవసాయ శాఖ అధికారులు స్పందించి రైతులకు సరిపడా పత్తి, వేరుశనగ, వరి విత్తనాలు, ఎరువులు, జీలగలు మంజూరు చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి ఒక ప్రకటనలో కోరారు. ఆదివారం గాలివీడు మండలంలో పర్యటించిన ఆయన రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతాంగానికి సబ్సిడీ రూపంలో ఆర్బీకే కేంద్రాల ద్వారా అవసరమైన విత్తనాలు వెంటనే అందించేందుకు వ్యవసాయ శాఖ అధికారులు దృష్టి సారించాలని కోరారు. మెట్ట ప్రాంతాల్లో సాగు చేసే పత్తి విత్తనాలను అధిక ధరలకు విక్రయించకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. స్కేలాఫ్ ఫైనాన్స్ ప్రకారం బ్యాంకు రుణాలు రైతులందరికీ అందించాలని డిమాండ్ చేశారు. ముందుగా భూసార పరీక్షలు నిర్వహించి రైతులకు ఏ ఎరువులు వాడాలో అవగాహన కలిగించాలని కోరారు. కౌలు రైతులకు భూయజమానులకు సంబంధం లేకుండా గ్రామసభల ద్వారా కార్డులు వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అవకతవకలుగా ఉన్న భూసర్వేను రద్దు చేసి రైతుల సమక్షంలో గ్రామ స్థాయి రెవెన్యూ అధికారులు రీసర్వే చేసి గత పాసుపుస్తకాలను అనుసరించి సవరించాలని కోరారు. రైతుల మధ్య చిచ్చుపెట్టే విధంగా ఉన్న భూసర్వే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## శిల్పారామంలో ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

పులివెందుల రూరల్, జూన్ 2, ప్రభాతవార్త

పులివెందుల శిల్పారామంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. పట్టణానికి చెందిన శ్రీరాజా కళానిలయం చిన్నారులచే సమ్మర్‌క్యాంప్ ముగింపు వేడుకలు నిర్వహించారు. ఇందులో భాగంగా జానపద, సినీ గీతాలకు పిల్లలు లయబద్ధంగా అడుగులు వేసి అందరినీ ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో శిల్పారామంల పరిపాలనాధికారి సుధాకర్, నృత్య శిక్షకుడు రాజా, తదితరులు పాల్గొన్నారు.


## ముగిసిన హనుమజ్జయంతి వేడుకలు



బద్వేలు అర్బన్, జూన్ 2,(ప్రబాతవార్త):

బద్వేలు పట్టణంలోని పలు ఏరియాలలోని ఆలయాలలో మూడు రోజులపాటు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆదివారం పోరుమామిళ్ల రోడ్డు నాగుల చెరువు కట్ట వద్ద వెలసిన ఆంజనేయస్వామి దేవాలయంలో ఆంజనేయస్వామికి పలురకాల పూజలు నిర్వహించారు.అనంతరం సాయంత్రం పలువురు కమిటి సభ్యులు, భక్తుల ఆధ్వర్యంలో స్వామివారి ఊరేగింపు పురవీధులలో ఘనంగా నిర్వహించారు. ఈ గ్రామోత్సవంవెంట భక్తులకు ప్రసాదాలను అందజేశారు. జై శ్రీరామ్, జై శ్రీరామ్ అంటూ భక్తులు తమ భక్తిని చాటుకున్నారు.

## శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవు



సుండుపల్లె, జూన్ 2, ప్రభాతవార్త: సార్వత్రిక ఎన్నికల మంగళవారం ఫలితాలు వెలువడనున్న నేపథ్యంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై ఎస్ఎంకె హుసేన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలో ఎక్కడా కూడా వ్యాపారాల దుకాణాలను తెరవరాదని ఆదేశాలు జారీ చేయడం జరిగింది. ఎన్నికల కోడ్ ఉన్నందున 144 సెక్షన్ అమలులో ఉంటుందని సూచించారు. సార్వత్రిక ఫలితాలు వచ్చిన తరువాత బాణాసంచా కాల్చడం కానీ, ర్యాలీలు నిర్వహించడం కానీ సభలు విజయోత్సవ కార్యక్రమాలు చేయరాదన్నారు. ఇప్పటికే గతంలో అల్లర్లు చేసిన వారిపై బైండోవర్ కేసులు నమోదు చేసి అదుపులోకి తీసుకోవడం జరిగిందని హెచ్చరించారు. ఎవరైనా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే వారిపైన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

========

# రైతులకు నిత్యం 'భగీరథ' యత్నమే...

## -1000 అడుగులు బోరు వేసినా పడని నీళ్ళు-ఎటు చూసిన ఎండిన పంటలు, బోర్లే దర్శనం

మదనపల్లె, జూన్ 2 ప్రభాతవార్త :

తాగునీటి కోసం...బారులుతీరుతున్న బిందెలు...అక్కడక్కడ మహిళలు ఘర్షణలు...తోపులాటలు...పోలీసులకు ఫిర్యాదులు...రైతులకు ఎటు చూసినా ఎండిన పంటలు...ఆవిరైపోయిన బోర్లే దర్శనం...ఎండవేడిమికి...వరుణుడు కరుణించక బోర్లన్నీ ఎండుమొఖం పట్టాయి. ఇలాంటి పరిస్థితుల్లో మదనపల్లెలో నీటికోసం పలు కాలనీల్లో ప్రజలుఅధికారులను కోరుతున్నారు. మదనపల్లె రూరల్ ప్రాంతాల్లో నీటి జాడ కోసం రైతులు నిత్యం భగీరథ ప్రయత్నం చేస్తున్నారు. నీళ్ళు ప్రాంతాలో ఎంతవరకు ఉంటే అంతలోతు వరకు బోరుబావి తవ్వినా నీళ్ళు పడని పరిస్థితి ఎదురవుతుంది. భూగర్భజలాలు రోజు రోజుకు అడుగంటుతుండడంతో నీళ్ళు వందల అడుగులు కొద్ది బోరు వేసినా పైకిరాని పరిస్థితి నెలకొంటోంది. గత ఆరు నెలలుగా రైతులు ఈ బోరు కోసం లక్షలాదిరుపాయలకు పైగా ఖర్చు చేశారంటే ఆశ్చర్యం కలుగుతుంది. అన్నమయ్యజిల్లా మదనపల్లె నియోజకవర్గంలోని రైతులు వ్యవసాయ పంటల సాగుకోసం వందల అడుగుల కొద్ది బోరును డ్రిల్లింగ్ చేస్తున్నారు. వెయ్యి నుంచి 1200 అడుగులు బోరు తవ్వినా నీళ్ళు పడడం లేదు. దీంతో రైతులు కోట్లాది రుపాయలు మట్టిపాలు అవుతోంది. మదనపల్లె, రామసముద్రం, కురబలకోట, బి.కొత్తకోట, పిటిఎం, వాల్మీకిపురం, కలికిరి, నిమ్మనపల్లె మండలాల్లో గత ఆరు నెలలుగా వేల సంఖ్యలో రైతులు బోర్లు వేశారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో మంచినీటి సమస్య నెలకొనడంతో ప్రభుత్వ బోర్లుకూడా డ్రిల్లింగ్ చేశారు. తొలుత వెయ్యి అడుగులు బోరు వేసినా నీళ్ళు పడలేదు. ఆ తరువాత హై కెపాసిటి గల బోరు బండ్లతో 1200 అడుగులకు డ్రిల్లింగ్ చేసినా చుక్కనీరు కూడా బయటకు రాని పరిస్థితి నెలకొంది. గతంలో వంద అడుగులకే భూగర్భజలాలు దొరుకుతున్నా నేడు పాతాళంలోకి వెళ్ళినా నీళ్ళు పడకపోవడం జరుగుతోంది. 80శాతం గ్రామాల్లో మంచినీటి సమస్య, సాగునీటి సమస్య నెలకొంది. వర్షాలు పడకపోవడం వల్ల ఈ ప్రాంతాల్లో ఉన్న చెరువులు, ప్రాజెక్టులు, కుంటలు, నిండకపోయాయి. దీంతో భూగర్భజలాలు భారీగా అడుగంటాయి. ఈ ప్రాంతమంతా వర్షాలపై ఆధారపడుతారు. వర్షాలు







భారీగా పడితేనే పంటలు సాగు అవుతాయి.గ్రామాల్లో మంచినీటి సమస్య తీరుతుంది. వర్షాలు అనుకొన్న మేరకు పడకపోవడంతో ప్రతి ఏటా భూగర్భజలాలు క్రమేనా తగ్గుతూ ఉన్నాయి. గత నెల రోజులుగా టమోటాలకు బాగా ధరలు వచ్చాయి. పంట ఉన్న రైతులకు బాగా డబ్బులు వచ్చాయి. ఈ రైతులు బోర్లు వేయడం మొదలుపెట్టారు. టమోటాల్లో వచ్చిన డబ్బులన్నీ బోర్లకే పెట్టేశారు. కొందరు రైతులు బంగారు తాకట్టు పెట్టడం, ప్రైవేటుగా వడ్డీలకు అప్పులు చేసి బోరు వేయడం జరిగింది. నీళ్ళు పడకపోవడంతో తీవ్రంగా నష్టపోయారు. మామూలుగా వెయ్యి అడుగులకు బోరు వేయాలంటే కేసింగ్‌తో కలిసి రూ.2.50లక్షలు ఖర్చు అవుతుంది. ఈ బోరుబావికి హైపవర్ మోటార్, పంపు, కేబుల్, స్టాటర్ ఏర్పాటుచేయాల్సి ఉంది. దీనికోసం రూ.3లక్షలు ఖర్చు అవుతుంది. ఒకవేళ నీళ్ళు పడినా మరుసటి నెలకే తగ్గిపోయే పరిస్థితి ఉంది. వర్షాధారప్రాంతమైన పడమటి ప్రాంతంలో నదీజలాలు వస్తేకాని భూగర్భజలాలు పెరగని పరిస్థితి ఉంది. పుష్కలంగా నీరు పడిన బోరు కనీసం సంవత్సరం కూడా ఉపయోగపడకుండా అడుగంటిపోతున్నాయి. పశువులకు సైతం తాగునీరు కష్టం అవుతుంది. తాగునీరు దొరకక అటవీప్రాంతంలోని వన్యమృగాలు గ్రామాల్లోకి వస్తున్నాయి. ఇంతటి దుర్భిక్షను మునుపెన్నడూ చూడలేదని ఈ ప్రాంతవాసులు చెబుతున్నారు. ప్రభుత్వం స్పందించి నదీజలాలను తీసుకువస్తే కాని భూగర్భజలాలు పైకి రాని పరిస్థితి ఎదురవుతుంది.

## కడప జిల్లాలో టీబీ మందులకు కొరత లేదు

### – రాష్ట్ర టీబీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ టి.రమేష్ వెల్లడి



ఉన్నాయని ఆయన స్పష్టం చేశారు. ప్రొద్దుటూరు జిల్లా ఆసుపత్రిలోని టిబి రోగులెవరికీ టిబి మందులను బయటి నుండి కొనుగోలు చేయమని వైద్యులెవరూ సూచించలేదని ఆయన వివరించారు. ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమీషనర్ సూచనల మేరకు కడప జిల్లా టిబి అధికారి ఇప్పటికే మందుల్ని అవసరమైన స్థాయిలో అందుబాటులో ఉంచారన్నారు. అంతేకాక స్థానికంగానే టిబి మందుల్ని కొనుగోలు చేసి మరీ మందులు అందుబాటులో ఉంచామని ఆయన తెలిపారు. జిల్లా ఆసుపత్రి లో డాక్టర్లు ఎవరు కూడా బయట మందులు కొనుక్కొమని ఏ పేషెంట్ కూ చెప్పలేదని ఆసుపత్రి ముఖ్య వైద్యాధికారి తనకు తెలియజేశారని డాక్టర్ రమేష్ పేర్కొన్నారు. ప్రస్తుతం ఆసుపత్రిలో ఉన్న ఏడుగురు రోగులకు కూడా ఇంకా నాలుగు రోజులకు సరిపడా టీబీ మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో కూడా మందుల నిల్వల్ని తగినంతగా అందుబాటులో ఉంచామని జేడీ డాక్టర్ రమేష్ తెలిపారు. ఇటీవల తాము అన్ని జిల్లాలను సమీక్షించామనీ, అలాగే కేంద్ర సరఫరాలను కూడా ఎప్పటికప్పుడు జిల్లాలకు పంపుతున్నామని తెలిపారు. కడప జిల్లాకు పంపిన మందులు వెయ్యి మంది రోగులకు ఒక నెలరోజుల వరకు సరిపోతాయని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఎక్కడ కూడా టీబీ మందుల కొరత లేదని ఆయన స్పష్టం చేశారు.

## ప్రతి ఉద్యోగికి పదవి విరమణ తప్పనిసరి

బద్వేలు, జూన్ 2 (ప్రభాతవార్త)

: ప్రతి ఉద్యోగికి పదవి విరమణ సర్వసాధారణమని వ్యవసాయశాఖ కడప ఏడిఏలు సుబ్బారావు, నరసింహారెడ్డి,జిల్లా ఏఈవో అసోసియేషన్ అధ్యక్షులు ప్రభాకర్‌రెడ్డిలు పేర్కొన్నారు. ఆదివారం ఏఈవో ఆవుల శ్రీనివాసరావు పదవి విరమణ కార్యక్రమాన్ని పురస్కరించుకునిపట్టణంలోని ఓ కళ్యాణ మండపంలో పదవి విరమణ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీనివాసరావు తన విధులలోనిక్కచ్చిగా వ్యవహరించి అందరి మన్ననలు పొందారని కొనియాడారు. ఆయన తన శేష జీవితాన్ని ప్రశాంతంగా గడపాలని వారు ఆకాంక్షించారు.అనంతరం కడప అర్బన్ డెవలప్‌మెంటు సొసైటీ చైర్మన్ సింగసాని గురుమోహన్, వ్యవసాయ శాఖ, హార్టికల్చర్ , సెరి కల్చర్ తదితర శాఖలఅధికారులు శ్రీనివాసరావు దంపతులను పూలమాల, శాలువాతో ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో ఏపీ ఎన్‌జీవో అసోసియేషన్ నాయకులు సాంబశివారెడ్డి,బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటసుబ్బారెడ్డి, పుష్పరాజ్, తదితరులు పాల్గొన్నారు.




# "మామిడెంత మధురం"...


## - తగ్గిన దిగుబడులు - పెరిగిన ధరలు- మామిడి రైతులకు ప్రోత్సాహకం కరువు

## - కనుమరుగవుతున్న మల్‌గూభ రకం

పీలేరు, ప్రభాతవార్త :

పండ్లల్లో రారాజు మామిడిపండు...మామిడిపండు అమృతంతో సమానంగా ఉదహరిసాతరు. అరుచి ఆమోఘం..అద్భుతం, అనిర్వచనీయం. పసుపుపచ్చని రంగులో నిగనిగలాడే మామిడి ఫలాలనుచూస్తే ఆరేళ్ళ చిన్నారి నుంచి అరవైఏళ్ల ముదుసలి వరకు మామిడిపండును చూస్తే లొట్టలేస్తారనడంలో ఎటువంటి అతిశయోక్తిలేదు. మామిడిపండు రుచి చూడకపోయినా, మామిడిపచ్చడి తినకపోయినా ఆ జీవితం వృధా అనే నానుడి సైతం ప్రచారంలో ఉందంటే మామిడి ప్రాముఖ్యత ఏ పాటిదో ఇట్టే అర్థమౌతుంది. మామిడిపళ్ళ సీజన్‌లో మామిడి ఫలాలను ఆరగించని వారుండరంటే బహుశా అతిశయోక్తికాదేమో. ఇంతటి ప్రాధాన్యత కలిగిన మామిడి ఫలాలకు దేశంలోనే మన రాష్ట్రం ప్రసిద్ధి. అందనా అన్నమయ్యజిల్లాలోని తూర్పు ప్రాంతంలో అధికంగా లభించే బేనీషా, ఎర్రనీలం, మల్‌గూబ, చక్కెరగుత్తి వంటి మామిడి ఫలాలకు ఎంతో ప్రత్యేకత ఉంది. దేశ, విదేశ ప్రముఖులు మనస్సును సైతం మన మామిడి దోచేసింది. ఇంతటి ఘన చరిత్ర కలిగిన మధురఫలాలు నేడు తమ సహజత్వాన్ని కోల్పోయి నాణ్యత లేమిగా, అధిక ధరలతో సామాన్య, మధ్యతరగతి ప్రజలకు అందుబాటులో లేకుండాపోయాయి. వ్యాపారులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం మధురఫలాలైన మామిడిని విషతుల్యంగా మారుస్తున్నారు. అత్యధికంగా రసాయన వినియోగాలతో పంట పండించడం సహజంగా మాగాల్సిన మామిడిపండ్లను విషతుల్యమైన కార్బైడ్ ద్వారా మాగిస్తూ వినియోగదారుల ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్నారు. ఇంకా పలు రకాలైన రెడ్డిపసంద్, దిల్‌పసంద్, బెంగుళూర తదితర రకాలు పూర్తిగా నాణ్యతలేమిగా దొరుకుతున్నాయని వినియోగదారులు వాపోతున్నారు. అంత జరుగుతున్నా అధికారులు మాత్రం చోద్యం చూస్తుండడం





గమనార్హం. మరోవైపు ప్రతి ఏడాది మామిడిపండ్లు దిగుబడి కూడా తగ్గిపోవడంతో మంచి రకాలైన మామిడిపండ్లు సామాన్య, మధ్య తరగతి ప్రజలకు అందనంత ఎత్తులో ఉన్నాయని వినియోగదారులు వాపోతున్నారు. మే, జూన్ సీజన్‌లో ఒకప్పుడు కోట్లాదిరుపాయల వ్యాపారం జరిగేదని ప్రస్తుతం చాలా వరకు తగ్గిందని వ్యాపారులు పేర్కొంటున్నారు. ప్రభుత్వం మామిడిరైతులకు ప్రోత్సాహాన్ని అందించడంలో నిర్లక్ష్యం వహిస్తుండడం వల్లే మామిడిపండ్లు పెంపకం విస్తీర్ణం తగ్గుతోందని పలువురు ఆరోపిస్తున్నారు. వేలాది ఎరాల్లో సాగయ్యే మామిడి, ప్రస్తుతం వందల ఎకరాల్లో కూడా కనిపించని పరిస్థితి నెలకొంది. మరోవైపు మామిడిపండించే రైతులకు ధర గిట్టుబాటు కాకపోగా, వ్యాపారులు మాయాజాలంతో మార్కెట్లో అధిక ధరలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ప్రభుత్వాలు ఇప్పటికైనా ఎంతో ప్రాధాన్యత కలిగిన మధురఫలాలను కనుమరుగు కాకుండా చూసి మామిడి రైతులను ప్రోత్సహించాలని పలువురు కోరుతున్నారు.

# ఓట్ల లెక్కింపు ప్రక్రియకు సర్వం సిద్ధం

## - నగరంలో 144 సెక్షన్

కడప కార్పొరేషన్, జూన్ 2, ప్రభాతవార్త:

ఓట్ల లెక్కింపు ఘడియలు దగ్గర పడేకొద్దీ ప్రధాన పార్టీల అభ్యర్థులలో ఉత్కంఠత అధికమవుతున్నది. జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఫలితాలపై ముందస్తు అంచనాలు (ఎగ్జిట్ పోల్స్) అసెంబ్లీ ఎన్నికల పోరులో నువ్వా? నేనా! అన్నట్లుగా స్పష్టం చేస్తున్నాయి. ఈ ఉత్కంఠ పోరులో కొన్ని సంస్థలు రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వసుతందని, మరికొన్ని సంస్థలు ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి పూర్తి అవకాశాలున్నట్లు వెల్లడించాయి. ఏది ఏమైనప్పటికీ 4వ తేదీన విజేతలు ఎవరు? పరాజేతలు ఎవరు? తేలే సమయం దగ్గర పడింది ఓట్ల లెక్కింపునకు అధికార యంత్రాంగం నిమగ్నమైంది. ఏర్పాట్లు అన్నీ చక చకా జరిగిపోతున్నాయి. ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో, బయట భద్రత ఏర్పాట్లు పూర్తి చేసింది. ఓట్ల లెక్కింపులో పాల్గొనే ఇబ్బందికి శిక్షణ ఇచ్చారు. కౌంటింగ్ ఏజెంట్ల నియామకంతో సహా ఓట్ల లెక్కింపు రోజున పాటించాల్సిన చర్యలపై రాజకీయ పార్టీలకు అవగాహన కల్పించారు. భద్రతా పరంగా కఠిన చర్యలు తీసుకుంటున్నారు. ఈవీఎం ఓట్ల లెక్కింపు కోసం ప్రతి నియోజకవర్గానికి 14 టేబుళ్లు ఏర్పాటు చేశారు. నియోజకవర్గ వర్గాల వారీగా కమలాపురం 18 రౌండ్లు, కడప బద్వేలు (ఎస్సీ), ప్రొద్దుటూరు, మైదుకూరు 20, జమ్మలమడుగు 23, పులివెందుల 23 రౌండ్లలో ఓట్ల లెక్కింపు పూర్తి అవుతుంది. ఉదయం 8 గంటల నుంచి ప్రారంభం అవుతుంది. ప్రతి రౌండ్‌కు 20 నుంచి 30 నిమిషాల సమయం తీసుకుంటుంది. అన్ని సవ్యంగా జరిగితే సాయంత్రం 4 గంటలకు కడప పార్లమెంటు పరిధిలోని 7 అసెంబ్లీ స్థానాల ఓట్ల లెక్కింపు పూర్తి అవుతుంది. తొలి ఫలితం కమలాపురం ప్రకటిస్తే ఆ తరువాత వరుసగా కడప, ప్రొద్దుటూరు, మైదుకూరు, బద్వేలు నియోజకవర్గం ఫలితాలు వెలువడే అవకాశం ఉంది. చివరగా పులివెందుల, జమ్మలమడుగు ఫలితాలు రావచ్చు. ఓట్ల లెక్కింపు విధులకు హాజరయ్యే సిబ్బందితో సహా అభ్యర్థులు కౌంటింగ్ ఏజెంట్లకు ఆర్వోలు జారీ చేసిన గుర్తింపు కార్డులతోనే ప్రవేశం ఉంటుంది. కడప నగరంలో 144 సెక్షన్ అమలు చేసినట్లు ఎస్పీ తెలిపారు. కలెక్టర్ విజయరామరాజు ప్రత్యేక దృష్టి సారించి శాంతిభద్రతలు, ప్రశాంతంగా ఓట్లు లెక్కింపుపై చర్యలు తీసుకున్నారు. కడప నగరంలో ట్రాఫిక్ మళ్లింపునకు చర్యలు తీసుకున్నారు. కౌంటింగ్ కేంద్రంలో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. కౌంటింగ్ కేంద్రంలో మీడియా కేంద్రంతో పాటు అందరికీ భోజన వసతి కల్పిస్తున్నారు. రాజకీయ పార్టీల ర్యాలీలు విజయోత్సవాలకు పోలీసుల శాఖ అనుమతులు ఇవ్వడం లేదు.

## ఎక్కడికక్కడ నాయకుల హౌస్ అరెస్టు

## - కౌంటింగ్ నేపథ్యంలో ఆదేశాలు జారీ

పులివెందుల, జూన్ 2, ప్రభాతవార్త :


IN THE COURT OF SUB DIVISIONAL MAGISTRATE & REVENUE DIVISIONAL OFFICER, PULIVENDULA

ORDER:

పులివెందుల పట్టణంలో రాజకీయ పార్టీల ప్రధాన నాయకులను ఎక్కడికక్కడ ఎన్నికల అధికారుల ఆదేశాల మేరకు హౌస్ అరెస్టు చేశారు. ఈనెల 4న ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో కూటమి పార్టీలు, వైకాపాల మధ్య ఘర్షణలు తలెత్తే అవకాశాలు ఉన్నాయన్న సమాచారంతో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా వైకాపా, తెదేపా ప్రముఖ నాయకులను హౌస్ అరెస్టు చేయాలని రాష్ట్ర ఎన్నికల అధికారులు ఆదేశాలు జారీ చేశారు. పులివెందుల నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు నియోజకవర్గంలోని ఆయా నాయకులను హౌస్ అరెస్టు చేశారు. తెదేపా రాష్ట్ర కార్యదర్శి, మార్కెట్ కమిటి మాజీ ఛైర్మన్ తూగుట్ల మధుసూధన్‌రెడ్డి, యువజన విభాగం రాష్ట్ర నాయకుడు అక్కులుగారి విజయ్‌కుమార్‌రెడ్డిలను ఆదివారం ఉదయం పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. అలాగే వైఎస్ఆర్‌సీపీకి చెందిన కొందరు నాయకులను కూడా హౌస్ అరెస్టు చేశారు. ఎన్నికల కౌంటింగ్‌కు రెండు రోజుల ముందుగానే ప్రముఖ నాయకులను హౌస్ అరెస్టు చేయడం ఇదే ప్రథమం. గతంలో జరిగిన ఏ ఎన్నికల్లో కూడా నాయకులను హౌస్ అరెస్టు చేయలేదు. కానీ ఈ దఫా హౌస్ అరెస్టు చేయడం చర్చనీయాంశంగా మారింది. నియోజకవర్గ వ్యాప్తంగా ప్రధాన సరిహద్దుల్లోను, పులివెందుల మున్సిపాలిటీ సరిహద్దులోను పోలీసులు గస్తీ నిర్వహిస్తున్నారు. పులివెందుల పట్టణంలోకి, నియోజకవర్గంలోకి ఎవరు బయటి వారు ప్రవేశిస్తున్నారని పోలీసులు పరిశీలిస్తున్నారు. అంతేకాకుండా లైసెన్సు లేకుండా నడిపే ద్విచక్రవాహనాలను, ఫోర్ వీలర్ వాహనాలను పోలీసుస్టేషన్‌కు తరలిస్తున్నారు. బయటి వారు ఎవరు కూడా ప్రవేశించకుండా గట్టి భద్రత చర్యలు తీసుకున్నారు. బాణసంచా కాల్చడం, విజయోత్సవ ర్యాలీలు నిర్వహించడం చేయకూడదని పోలీసులు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈనెల 4న ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసుశాఖ ఎన్నికల అధికారుల ఆదేశాల మేరకు గట్టి భద్రతా ఏర్పాట్లను చేపట్టింది.

## వైభవంగా వాసవిమాత అమ్మవారికి ఒడిబియ్యం వల్లింపు కార్యక్రమం



బద్వేలు అర్బన్, జూన్2 ,(ప్రభాతవార్త): ఆర్యవైశ్య మహిళా మండలి అధ్యక్షురాలు దేవతి లలిత, స్టేట్ ఉపాధ్యక్షురాలు కొండపల్లి దేవి, మాజీ అధ్యక్షురాలు చింతకుంట ధనలక్ష్మి పలువురు మహిళా మండలి కమిటి సభ్యుల ఆధ్వర్యంలో ఆదివారం వాసవిమాత అమ్మవారికి వివిధ రకాల ప్రత్యేక పూజలను నిర్వహించారు. సాయంకాలంఅమ్మవారికి ఒడిబియ్యం వల్లిపు కార్యక్రమాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. అనంతరం వాసవిమాతకు సమర్పించిన చీరలను వేలంపాటద్వారా దక్కించుకున్నారు. ఈ కార్యకమ్రంలో ఆవోపా మహిళా విభాగం సెక్రటరి పెసల శ్రీవాణి, వైస్ ప్రెసిడెంట్ శ్రీరామ్ సుప్రజతో పాటుమహిళా మండలి సభ్యులు పాల్గొన్నారు. ఆదివారం ఒడిబియ్యం వల్లింపు కార్యక్రమంలో తులసి వెంకట రమణ సతీమణి సుబ్బరత్నమ్మమదుల్లపల్లె వాసు సతీమణి ధనలక్ష్మి, తిరువీధి సుబ్బారావు సతీమణి రాజమ్మ, నూతి సుధాకర్ సతీమణి పుష్పలత, దేవతి రమణయ్య సతీమణినాగమణి, జూటూరు గురు జయంత్ సతీమణి మాధవిలత, సముద్రాల భరత్ సతీమణి దీపిక, తులసి నాగరాజ సతీమణి లలిత, బొంతల సురేంద్ర సతీమణి కళ్యాణి, బెస్తవేముల సుబ్బారావు సతీమణి నాగశిరీష పాల్గొన్నారు. అలాగే ఆర్యవైశ్యవర్తకసంఘం అధ్యక్షులు కేవి.సుబ్బారావు, సెక్రటరీ నాగరాజ మరియు కమిటిసభ్యుల ఆద్వర్యంలో వాసవిమాత అమ్మవారికి తెల్లవారుజామున వివిధ రకాల ప్రత్యేక పూజలను వైభవంగా నిర్వహించారు. అనంతరంపలువురు ఉభయదాతలు భక్తి,శ్రద్ధలతో వాసవిమాత అమ్మవారిని దర్శించుకుని జైవాసవాంబ, జై వాసవాంబ అంటూతమ భక్తిని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో వనితాక్లబ్ ట్రెజరర్ గొంట్ల కుమారి, తులసి వసుంధర, మల్లేశ్వరి, చలపాటి క్రిష్ణవేణి, జూటూరు పద్మ,తులసి లక్ష్మిదేవి, హర్షితతో పాటు పలువురు మహిళలు కమిటి సభ్యులు పాల్గొన్నారు.

## ఓట్ల లెక్కింపు సందర్బంగా పోలీసు నిభందనలు అతిక్రమించరాదు

రాజుపాళెం, జూన్2, ప్రభాతవార్త.



మండల పరిదిలోని అన్నిగ్రామాలలో 4వతేదిన ఓట్లలెక్కింపు సందర్భంగా ఎన్నికల నియమావళి ప్రకారం పోలీసుల నిభందనలు అందరు పాటించాలని ఆదివారం రూరల్‌సిఐ ం వ ం ణా ెం డ్డి , య ం న్ ఐ తులసినాగప్రసాద్‌లు పోలీసు సిబ్బందితో గ్రామాలలో పర్యటించి జిల్లాయస్‌పి ఆదేశాల ప్రకారం హెచ్చరికలు జారీచేవారు.గ్రామాలలోని ప్రధాన కూడలిలలో ప్రజలతో సమావేశం నిర్వహించి ఓట్లలెక్కింపు ముందురోజు,లెక్కింపురోజు,తరువాత రెండు రోజులు144 సెక్షన్ అమలులో ఉంటుందని గుంపులుగా గుమికూడరాదని,ఎటువంటి సంభరాలుకూడా నిషేదమని పోలీసు నిభందనలకు వ్యతిరేకంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవని ప్రజలకు వివరించారు.అదనపు పోలీసు బలగాలతో గట్టిపోలీసు బందోబస్తు నిర్వహించటంతోపాటు ఆన్నతాధికారులు పర్యవేక్షణతోపాటు పర్యటనలు కూడా ఉంటాయని తెలిపారు.

## ఎన్నికల నియమాల్ని ఎవరూ అతిక్రమించవద్దు



కమలాపురం, జూన్ 2, ప్రభాతవార్త: కమలాపురం పట్టణంలో ఎస్సై హృషికేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో సీఐ రామకృష్ణారెడ్డి అధ్యక్షతన కేంద్ర బలగాలతో కమలాపురం పట్టణంలో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల కౌంటింగ్ రోజు అయిపోయిన తరువాత 144 సెక్షన్ అమల్లో ఉంటుందని ఎవరూ కూడా గుంపులుగా గుంపులుగా సంచరించకూడదని ప్రజలు విజ్ఞప్తి చేశారు. అత్యవసరమైతే తప్ప బయటికి రాకూడదని తమ తమ ఇళ్ల వద్దనే ప్రజలు ఉండాలని కోరారు. ఎవరైనా రెచ్చగొట్టేలా ప్రసంగాలు, వాట్సాప్‌లలో కించపరిచే విధంగా మాట్లాడినా వివిధ వాట్సాప్‌లలో కించపరిచే విధంగా మెసేజ్‌లు చేసినా వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా నాలుగంచెల పటిష్ట భద్రత

## - సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి- సిబ్బందికి దిశా నిర్దేశం చేసిన జిల్లా ఎస్పీ



కడప క్రైం, జూన్ 2, ప్రభాతవార్త:

ఈనెల 4న సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ జరగనున్న నేపథ్యంలో బందోబస్తు విధులపై వెళ్లే సిబ్బందికి జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ స్థానిక మౌంట్‌ఫోర్ట్ స్కూల్‌లో దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కౌంటింగ్ కేంద్రం వద్ద నాలుగంచెల పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. బందోబస్తు విధుల్లో ఉన్న జిల్లా పోలీసులతో పాటు కేంద్ర సాయుధ పోలీసు బలగాలు, ఏపీఎస్పీ బలగాలు నిరంతరం అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. పోలీసు అధికారులు సిబ్బందితో ఏర్పాటు చేసిన క్విక్ రెస్పాన్స్ టీమ్ (క్యూఆర్‌టీ)లు సిద్ధంగా ఉంటాయని, ఎలాంటి ఘటన గురించి సమాచారం వచ్చినా వెంటనే క్షణాల్లో ఘటనా స్థలానికి చేరుకుంటారని ఎస్పీ తెలిపారు. సమావేశం అనంతరం కౌంటింగ్ కేంద్రానికి వెళ్లే రహదారిపై అభ్యర్థులు కౌంటింగ్ కేంద్రానికి వెళ్లే రహదారిపై అభ్యర్థులు కౌంటింగ్ ఏజెంట్లను అనుమతించేదారులను ఏర్పాటు చేసిన చెక్ పోస్టులను పరిశీలించి పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) లోసారి సుధాకర్, ఏఆర్ అడిషనల్ ఎస్‌పీఎస్ఎస్‌వీ కృష్ణారావు, కడప డీఎస్పీ ఎండీ షరీఫ్, ఏఆర్‌డీఎస్పీ మురళీధర్, రిమ్స్ సీఐ రామచంద్ర, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కూటమి జోన్-5 శిక్షణ కార్యక్రమం



కడప వైద్యవిభాగం, జూన్ 2, ప్రభాతవార్త: కడప నగరంలోని డీఎస్ఆర్ కల్యాణ మండపంలో ఆదివారం జూన్ 4న ఎన్నికల లెక్కింపు ప్రక్రియలో పోస్టల్ బ్యాలెట్ ఓట్లకు సంబంధించి టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి జోన్-5 విభాగం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో పొలిట్ బ్యూరో సభ్యులు కడప జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, తెదేపా జోన్-5 ఇన్‌ఛార్జి వైకుంఠం ప్రభాకర్ చౌదరి, కడప నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి మాధవిరెడ్డి, పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, బండారు మనోహర్ నాయుడు, సీనియర్ అడ్వకేట్ జీఎస్ మూర్తి, కర్నాటి అమర్‌నాథ్‌రెడ్డి పాల్గొని కౌంటింగ్ ఏజెంట్లకు మార్గనిర్దేశం చేశారు.

## కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలించిన శ్రీనివాసరెడ్డి



కడప వైద్యవిభాగం, జూన్ 2, ప్రభాతవార్త: కడప నగరంలోని అబ్దుల్ కలాం ఉర్దూ యూనివర్శిటీలో కౌంటింగ్ కేంద్రాన్ని ఆదివారం కడప నియోజకవర్గ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి మాధవిరెడ్డి, పొలిట్ బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డిలు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

## చట్టాన్ని అతిక్రమించవద్దు గీత దాటితే తాటతీస్తాం ఎస్సై కెసి రాజు

అట్లూరు, జూన్ 2 ,ప్రభాతవార్త:



ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా ప్రతి ఒక్కరూ చట్టాన్ని అతిక్రమించవద్దని చట్టానికి లోబడే నడుచుకోవాలని జీవించాలని,పాటించాలని చట్టాన్ని బేఖతారు చేస్తే తాట తీస్తామని కఠిన చర్యలు తప్పవని ఎస్సై కే సి రాజు హెచ్చరించారు.శాంతి భద్రతల పర్యవేక్షణలో భాగంగా మండలంలో ఎన్నికల్లో శాంతియూతంగా కౌంటింగ్ ముగిసే వరకు ప్రత్యేక పోలీసు నిఘా ఉంటుందని,నలుగురుకి మించి గుమికూడరాదని తెలిపారు.ఎలాంటి అల్లర్లు,గొడవలకు పాల్పడరాదని, టపాసులు,ఊరేగింపులు నిర్వహించరాదని తెలిపారు.విజయోత్సవ ర్యాలీలు,ఊరేగింపులకు సమావేశాలకు అనుమతులు లేవని తెలిపారు.కౌంటింగ్ ముగిసినా,జూన్ 6 వరకు నిబంధనలు అమల్లో వుంటాయని తెలిపారు.ఎంతటి వారైనా నిబంధనలు ఉల్లంగిస్తే చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని ఆయన ఈ సందర్భంగా హెచ్చరించారు.తమ బిడ్డల భవిష్యత్తు కోసం ప్రతి ఒక్కరూ కష్టపడి జీవిస్తున్నారు.రెక్కాడితే కానీ డొక్కాడని మధ్య తరగతికి చెందిన వారున్నారు.మీరు మీ బిడ్డల భవిష్యత్తు కోసం కష్టపడుతున్నారు.ఎలాంటి గొడవలు,దురలవాట్ల జోలిక వెళ్లవద్దు.మీ బిడ్డల భవిష్యత్తు మీ చేతుల్లో ఉంది.జీవితాలను కష్టమయం చేసుకోవద్దు మీ కుటుంబ శ్రేయస్సు కోసం పాటుపడండి.మీకు మంచి భవిష్యత్తు వుంటుంది అన్నారు.

## బాలినాయునిపల్లెలో మహాభారతం ప్రారంభం

నిమ్మనపల్లె, జూన్ 2 ప్రభాతవార్త:

అన్నమయ్యజిల్లా నిమ్మనపల్లె మండలం వెంగంవారిపల్లె పంచాయితీ బాలినాయునిపల్లెలో ఆదివారం మహభారత యజ్ఞం పంచాయితీ పుర ప్రజలతో ప్రారంభమైంది. దాదాపు 43ఏళ్ళుగా ప్రారంభంమైన యజ్ఞం ప్రతి ఏడాది నిర్వహిస్తున్నారు. దాతలు వీరంరెడ్డివారిపల్లెకు చెందిన రెడ్డమ్మ, ఉల్లి శ్రీనివాసులు దంపతులచే ద్వజారోహణతో ప్రారంభించగా తిరుపతి వాస్తవులు మంజుల భగవతివారిచే హరికథ నిర్వహించారు. రాత్రి పీలేరు నివాసులు వెంకటేశ్వర నాట్యమండలిచే నాటకం జరిగినట్లు నిర్వాహకులు తెలిపారు.

## రాచవేటివారిపల్లె, వెంగంవారిపల్లెల్లో పోలిస్ పిగిటింగ్ ఏర్పాటు

నిమ్మనపల్లె, జూన్ 2 ప్రభాతవార్త :

ఎన్నికల కౌంటింగ్ దృష్ట్యా జూన్ 4న పలు గ్రామాల్లో అవాంచనీయ సంఘటనలు జరగకుండా పోలిస్ పిగిటింగ్‌లను ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ లోకేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని కొన్ని సమస్యాత్మాక గ్రామాల్లో కౌంటింగ్‌ను దృష్టిలో ఉంచుకొని రాచవేటివారిపల్లె, వెంగంవారిపల్లె పంచాయితీలో మూడు పోలీస్ టీమ్‌లు పహారీ కాస్తు ఎలాంటి గొడవలు, అల్లర్లు జరగకుండా చూస్తారన్నారు. రాష్ట్రంలో మూడు రోజులు పాటు మద్యం విక్రయాలు ఆపివేశామన్నారు. దీంతో పాటు నలుగురు కంటే ఎక్కువ మంది గుమికూడరాదని మైక్‌ద్వారా ప్రచారాలు నిర్వహించారు. గ్రామాల్లో సవాళ్ళు, ప్రతిసవాళ్ళు విసురుకొని గర్షణలకు దిగరాదని ఆయన తెలిపారు. నిత్యం గ్రామాల్లో ఉండి తాము పర్యవేక్షిస్తున్నట్లు ఆయన తెలిపారు.

## పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణమే ధ్యేయం డిఎస్‌పి ప్రసాద్‌రెడ్డి



మదనపల్లెక్రైం, జూన్ 2 ప్రభాతవార్త:

ఈనెల 4న జరగబోయే ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా శాంతి భద్రతల సమస్యలు ఉత్పన్నం కాకుండా జిల్లా ఎస్‌పి క్రిష్ణారావు ఆదేశాల మేరకు మదనపల్లె డిఎస్‌పి జి. ప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ పట్టణంలో శాంతి భద్రతల పరిరక్షణయే ధ్యేయంగా ఈ ఫ్లాగ్‌మార్జ్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వన్‌టౌన్ సిఐ వల్లీబసు, టూటౌన్ సిఐ యువరాజ్, ఎస్ఐలు వెంకటసుబ్బయ్య, హరిహరప్రసాద్, స్పెషల్‌పార్టీ సిబ్బంది, ఏపిఎస్‌సి సిబ్బంది కలసి ఆదివారం బెంగుళూరు బస్టాండు, ఆర్‌ఆర్‌వీధి, చెంబకూరు రోడ్డు, కమ్మవీధి, శాస్త్రీ వీధి, నెహ్రూబజార్, అప్పారావుతోట, సైదాపేట బడేమకాన్ పలు ప్రాంతాల్లో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఎన్నికల కోడ్‌తో పాటు 144సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. ఎవరైనా ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు.

## బోరు మోటారు అమర్చిన మున్సిపల్ అధికారులు నీటి సరఫరా పునరుద్దరణతో ప్రజలు హర్షం



**వార్తకు స్పందన**

మదనపల్లె, జూన్ 2 ప్రభాతవార్త

మదనపల్లె మున్సిపాలిటి రెండవ వారుడలోని మంజునాథ్‌కాలనీలో తాగునీటి సరఫరా బోరు మరమ్మత్తులు పర్తి చేయడంలో జరిగిన ఆలస్యంపై స్పందిస్తూ ఆదివారం మరమ్మత్తులు చేసి బోరు బావికి తిరిగి మోటారును అమర్చడం జరిగింది. దీంతో స్థానికకాలనీ వాసులకు నీరు సరఫరా కావడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. సమస్యను గుర్తించి వెంటనే నీటి సరఫరా పునరుద్దరణకు చర్యలు చేపట్టిన సిబ్బందికి, పాలకులకు సంబంధిత అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

## మదనపల్లెనుంచి తంబళ్ళపల్లె మల్లయ్యకొండకు ప్రత్యేక బస్సులు

మదనపల్లె, జూన్ 2 ప్రభాతవార్త:



మదనపల్లె నుంచి తంబళ్ళపల్లె మల్లయ్యకొండకు ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఆర్టీసి వన్‌డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తంబళ్లపల్లెలోని బ్రమరాంబ మల్లికార్జునస్వామి భక్తుల సౌకర్యార్థం మల్లయ్యకొండపైకి ప్రతి సోమవారం మూడు ప్రత్యేక ఆర్టీసి బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు. మదనపల్లె ఆర్టీసి బస్టాండు నుంచి ఉదయం 5గంటలకు మొదటి బస్సు, రెండవ బస్సు 6.30గంటలకు మూడవ బస్సు 7గంటలకు బయలుదేరనున్నట్లు చెప్పారు. ప్రయాణీకులు, భక్తులు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## రాజంపేటలో 250 ఎకరాలలో ఉద్యానవన పంటలకు నష్టం




రాజంపేట అర్బన్, జూన్2 ప్రభాతవార్త

రాజంపేట మండలం లో శనివారం వీచిన బలమైన ఈదురు గాలులు,వర్షము వలన జరిగిన పంట నష్టం పై ఉద్యానవన శాఖ అధికారులు క్షేత్రస్థాయి సర్వేకి శ్రీకారం చుట్టారు .ప్రాథమిక అంచనా ప్రకారం దాదాపు 210 ఎకరాల్లో అరటి, 15 ఎకరాలలో బొప్పాయి, 7ఎకరాలు నిమ్మ పంట నేల కొరిగినట్లు రాజంపేట ఉద్యాన అధికారి జి.సురేష్ బాబు తెలిపారు.మండలంలోని హస్తవరం, పోలి, మందరం,మందపల్లి ,బ్రహ్మనపల్లె, పెద్దకారంపల్లి, ఆకేపాడు,రాజంపేట ఆర్.బి.కెల పరిదిలో పంట నష్ట ప్రాథమిక నివేదికను జిల్లా అధికారులకు పంపడం జరిగిందని తెలిపారు.ప్రభుత్వం నుంచి పంట నష్ట నివేదిక మార్గదర్శకాలు జారీ అయిన వెంటనే ఆర్.బి.కేల పరిధిలో నష్టపోయిన రైతుల జాబితాను నష్టపరిహారం కోసం పంపడం జరుగుతుందన్నారు.క్షేత్రస్థాయిలో ఉద్యాన,వ్యవసాయ సిబ్బంది రైతు భరోసా కేంద్రాల పరిధిలో నష్టపోయిన రైతుల పంటలను ప్రస్తుతం పరిశీలించడం జరుగుతుందని తెలిపారు.

# అంగరంగ వైభవంగా పాలేటమ్మ జాతర

చిన్నమండెం, జూన్ 2, ప్రభాత వార్త :


మండలంలోని కలిబండ గ్రామం పొలిమేరపల్లెలో వెలసిన మహిమానితురాలి పాలేటమ్మ జాతర శని, ఆదివారాలలో అంగరంగ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా శనివారం అమ్మవారిని వివిధ పుష్పాలతో అత్యంత సుందరంగా అలంకరించారు. సాయంత్రం గ్రామంలోని మహిళలు సామూహికంగా పెద్ద ఎత్తున బోనాలతో బ్యాండు మేళాల మధ్య సాంస్కృతిక కార్యక్రమాలతో మెరువనిగా వెళ్లి ఆలయ ప్రాంగణంలో బోనాలు సమర్పించి అమ్మవారికి నైవేద్యం పెట్టారు. మొక్కులు తీర్చుకొన్నారు. శనివారం సాయంత్రం భారీ వర్షం కురవడంతో తిరుణాల ప్రాంగణం అహ్లాదకరంగా మారింది. ప్రతి ఒక్కరు వేసవి తాపం నుండి సేద తీరారు. రాత్రి మొక్కుబడులు ఉన్న వారు చాందిని బండ్లు కట్టి ప్రదక్షనలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బాణ సంచా పేలుళ్ల, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను కనువిందు చేశాయి. ఇంటింటికి జంతు బలులు ఇచ్చారు. ఆదివారం బంధుమిత్రులతో విందు భోజనాలతో ఆనందంగా గడిపారు. ఈ జాతరకు చిన్నమండెం, పెద్ద మండెం మండలాల నుండే కాక వివిధ ప్రాంతాల నుండి వేలాదిగా తరలివచ్చారు.





## భారీ మెజార్టీతో మిథున్ రెడ్డి, ఎమ్మెల్యే కోరముట్ల గెలుపు ఖాయం: ధ్వజారెడ్డి.

రైల్వేకోడూరు జూన్ 2 ప్రభాతవార్త..



రైల్వే కోడూరు నియోజకవర్గంలో గత నెల 13న జరిగిన స్వారత్రిక ఎన్నికలలో రాజంపేట పార్లమెంటు సభ్యులు డైనమిక్ లీడర్ మిథున్ రెడ్డి, హ్యాట్రిక్ వీరుడు కొరముట్ల శ్రీనివాసులు విజయవంతంగా గెలవనున్నారని మండల ఉపాధ్యక్షులు రామిరెడ్డి ధ్వజారెడ్డి అన్నారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ విజయమే తమ లక్ష్యమని అందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు విజయానికి దోహదపడతాయని అన్నారు. ముఖ్యంగా మహిళలు ఎక్కువ శాతం వైసీపీ ప్రభుత్వానికి మద్దతు తెలిపారని అన్నారు. రైల్వే కోడూరు నియోజకవర్గంలో గెలుపు విజయవంతంగా అమలవుతుందని అందుకు నిదర్శనమే మహిళలు పోలింగ్ లో ఎక్కువ శాతం పాల్గొన్నారని తెలిపారు. .జూన్ నెల నాలుగు వ తేదీ వచ్చే ఫలితాల కోసం నియోజకవర్గ ప్రజలు చూస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ తోట శివ సాయి రమణారెడ్డి రాజారెడ్డి మల్లు కృష్ణారెడ్డి సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.